

కథా కౌముది

# కోలంది తీలిందోచ్!

## రచన : రవీంద్రనాథ్ ఠాగూర్

## (ఇచ్ఛాపూరణ్, బెంగాలీ, 1895)

## తెలుగుసేత : చంద్రలత (2018)

"పేరులో ఏముంది ?" అని మాటవరసకు అంటాం కానీ, పెట్టిన పేరును సార్థకం చేసుకోవాలనే ఎవరమైనా అనుకొంటాం. కానీ, పెట్టిన పేర్లకు ఏమాత్రం పొంతన లేని వాళ్ళలో, ఆ నాన్నాకొడుకులు ఇద్దరూ ఉంటారు. సుబల్ చంద్ర కొడుకు సుశీల్ చంద్ర.

నాన్న సుబల్ చాలా బలహీనంగా ఉండే వాడు. కొడుకు సుశీల్ మంచీమర్యాద పట్టించుకోని అల్లరిపిల్లవాడు.

సుశీల్ తన అల్లరిపనులతో ఇల్లు పీకి పందిరివేసి గానీ ఊరుకోడు. జిత్తులమారి తుంటరి పిల్లవాడని వారి ఇరుగుపొరుగు వారిలో పేరు మోశాడు.

కొడుకు సుశీల్ కొంటె పనులు తండ్రి సుబల్ కు ఏమాత్రం నచ్చేవి కాదు.

సుశీల్ తండ్రి పెట్టే క్రమశిక్షణానియమాలను ఏనాడు పాటించేవాడు కాదు. బిగుసుకుపోయిన మోకాళ్ళతో, కీళ్ళనొప్పులతో "ఉస్సో"మనే నాన్న నుంచి, జింకలా, ఇట్టే పారిపోయేవాడు. అయినా, అప్పుడప్పుడు తప్పించుకోలేక, దొరికిపోయి, నాన్న చేతిలో బడితపూజ చేయించుకొనే వాడు.

ఆ రోజు శనివారం. ఒంటిపూట బడి. పొద్దున్నే మొదలయ్యి, రెండింటికి బడి అయిపోతుంది. అదేమిటో గానీ, బడిగంట చెవిలో పడితే చాలు, సుశీల్ కు చిర్రెత్తుకు వస్తుంది.

ఆ పూట సుశీల్ కు అలా చిర్రెత్తుకు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటి కారణం భౌగోళిక శాస్త్రంలో ఆ రోజు పరీక్ష రాయాలి. రెండో కారణం పక్కింటి బోసు గారి ఇంట్లో టపాకాయలు తయారు చేస్తున్నారు.

బడికి వెళితే, టపాకాయల తయారీ సందడిలో తాను పాల్గొన లేదు. బడికి వెళ్ళి తిరిగి వచ్చే లోపల, సాయంకాలం అవుతుంది. చీకటిపడగానే,ఆ టపాకాయలన్నీ ఢామ్మని పేలిపోతాయి. తారాజువ్వలు ఆకాశంలోకి జుమ్మని దూసుకుపోతాయి. కాకరొత్తులు,చిచ్చుబుడ్లు ,భూచక్రాల సంగతి సరేసరి !

ఎలాగయినా సరే, ఈ పూట బడి ఎగ్గొట్టాల్సిందే!

అదెంత పని! అది సుశీల్ వెన్న తో నేర్చిన విద్య !

సుశీల్ ఉత్తుత్తి కడుపునొప్పిని నటిస్తూ, దొంగఏడుపులు ఏడుస్తూ, మంచం మీద దొర్లుతూ ఉన్నాడు.

నాన్న సుబల్ ఏమాత్రం చలించలేదు. కొడుకు సుశీల్ ఉత్తిత్తి ఏడుపుల ఎత్తులు,కడుపునొప్పుల జిత్తులు అన్నీ సుబల్ కి తెలుసు. కొడుకు ఎత్తుకు పైఎత్తు ఆలోచించసాగాడు.

కాసేపటి తరువాత, ఎలాంటి స్పందన లేని ముఖంతో, కొడుకుతో గట్టిగా అన్నాడు.

"కదలకుండా పడుకో ,సుశీల్ ! క్షణాల్లో కషాయం కాసుకొస్తా!"

సుశీల్ పని పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయింది.

అంతకు ముందు ఒకసారి, తండ్రి చేసుకువచ్చిన కషాయం గుర్తుకువచ్చింది. సుశీల్ నోరంతా చేదుగా అయిపోయింది.

సుబల్ ఒక తళతళలాడే పెద్ద చెంబు నిండా, వేడివేడి కషాయం తీసుకొని ,ఆ గదిలో అడుగు పెట్టాడో లేదో, సుశీల్ మంచం మీద నుంచి ఛెంగున ఒక గెంతు గెంతాడు!

" నాన్నోయ్ ! నా కడుపునొప్పి తగ్గిపోయిందోచ్ ! " అని అరిచాడు. గబగబ బడికి వెళ్ళడానికి తయారవ్వడం మొదలు పెట్టాడు.

నాన్న సుబల్ ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. సుశీల్ కు ఖచ్చితంగా చెప్పేసాడు.

" సుశీల్ ! అటూఇటూ కదలకుండా, రోజంతా మంచంలోనే పడుకో ! "

సుబల్ అలా అని,' ఏదో చిన్నపిల్లాడు కదా' అని ఊరుకొన్నాడా అంటే ,అదీ లేదు. కాసుకొచ్చిన కషాయన్ని సుశీల్ చేత బలవంతంగా తాగించాడు.

అది అలాంటి ఇలాంటి కషాయం కాదు. ఈ సమస్త భూమండం మీద సుబల్ మాత్రమే తయారు చేయ గలడు! వేపాకు,కుంకుడుకాయలు కాకరకాయలు కలిపి, కాసినంత కటికచేదు ఉన్న కషాయం. యాక్!

సుశీల్ ను గదిలో పెట్టి, తాళంవేసుకొని బయటకు వెళ్ళిపోయాడు నాన్న సుబల్.

రోజు గడుస్తున్న కొద్దీ, సుశీల్ లో అసహనం పెరిగిపోసాగింది. ఎంత బుద్ధిమంతుడయిన పిల్లవాడికయినా, నాలుగు గోడల మధ్యన బంధీ అయిఉండమంటే, ఎలా తోస్తుంది?

అసలే, సుశీల్ కు ఎన్నడూ రెండు కాళ్ళూ ఒక దగ్గర కుదురుగా ఉండవు కదా! సుశీల్ ఇంటికప్పు ఎగిరేలా ఏడ్చాడు. వెక్కిళ్ళు పట్టి ఏడ్చాడు.

'నేనొక చిన్న పిల్లాడిని అనే కదా,ఇలా పెద్దవాళ్ళు నా మీద పెత్తనాలు చేస్తున్నారు !' సుశీల్ ఉక్రోషంగా అనుకొన్నాడు. 'నేనే పెద్దవాణ్ణయితేనా,నాకు ఇష్టం వచ్చినట్లు ఉండేవాడిని. నాకు నచ్చినవన్నీ చేసుకొనేవాడిని. ఎప్పుడు ఏమేమి చేయాలో నేనే నిర్ణయం తీసుకొనేవాడిని!'

సరిగ్గా సుశీల్ గది బయట కూర్చుని ఉన్న సుబల్ కూడా, ఇలాగే ఆలోచిస్తున్నాడు. అల్లరిచిల్లరిగా చెట్లమ్మట గట్లమ్మట తిరిగిన చిన్నతనాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. 'ఆ రోజుల్లో తన అమ్మానాన్నల మాటలు తనెప్పుడు లెక్కపెట్టాడు కనుక! వాళ్ళు పొగిడినా తెగిడినా, పట్టించుకొన్న పాపాన పోయాడా? అందుకేగా, తన చదువు చట్టు బండలయ్యింది. బడిలో బాగా చదువుకొని వుంటే ఎంత బావుండేది! అయ్యో, మళ్ళీ ఒకసారి చిన్న పిల్లాడిని అయిపోతే బావుణ్ణు. చక్కగా బడికి వెళ్ళి, బుద్ధిగా చదువుకొంటాను!' అనుకొంటున్నాడు సుబల్.

నాన్నాకొడుకులు ఇద్దరూ వారి వారి ఆలోచనలలో మునిగి తేలుతున్నప్పుడు. అటువైపుగా, ఇచ్చాఠాకూరాణీ వెళుతున్నది. ఇచ్చా ఠాకూరాణీ కోరుకున్న కోరికలను పూరించే తల్లి. వాళ్ళిద్దరి మనసులో మాటలు ఆమె చెవిలో పడనే పడ్డాయి! ఇంకేముంది! పెద్దమనసుతో, వారి కోరికలను ఇచ్చాఠాకూరాణీ తీర్చేసింది !

" బూం ! హాం ఫట్ ! మీ కోరికలు తీరును గాక !"

నాన్న సుబల్ వయస్సు కొడుకు సుశీల్ కీ, కొడుకు సుశీల్ వయస్సు నాన్న సుబల్ కీ ఇచ్చేసింది ఇచ్చాఠాకూరాణీ!

ఆ మరునాడు పొద్దున్నే,

తమ కోరికలు తీరిన ఉత్సాహంతో, సంతోషంతో, హుషారుగా నిద్ర లేచారు, తండ్రీకొడుకులు !

★★★

మామూలుగా అయితే, నాన్న సుబల్ ఆలస్యంగా నిద్రపోయేవాడు. ఆలస్యంగానే నిద్ర లేచేవాడు. ఇప్పుడేమో, ఉత్సాహం ఉరకలు వేసే చిన్న పిల్లవాడు కదా! ఆ పొద్దున అటు సూర్యుడు తూర్పున పొడవగానే,ఇటు మంచమ్మీద నుంచి చెంగున ఒక్క ఎగురు ఎగిరి, లేచికూర్చున్నాడు. అతని కాళ్ళూ చేతులు చక్కగా, చకచకా కదులుతున్నాయి.

అంతకుమునుపు వదులయి పోయిన పలువరుస ,ఇప్పుడు గట్టిగా బలంగా ఉంది. అతను రాత్రి వేసుకొన్న దుస్తులు, ఇప్పటి చిన్నశరీరానికి వదులయిపోయి, అతని వంటి మీద తమాషాగా వేలాడుతూ ఉన్నాయి.

మరోవైపు, ఒక్కసారిగా వయసు మీద పడిన కొడుకు సుశీల్ కు నిద్ర లేవాలంటే, మునుపు ఎన్నడూ లేనంత బద్ధకం ముంచుకు వచ్చింది. మంచం మీద నుంచి లేవలేక లేచాడు. కళ్ళు పుసులుకమ్మాయి. పైగా, బయట నుంచి చిన్న పిల్లవాడిలా మారిపోయిన నాన్న సుబల్ గోల. మరి, లేవక తప్పుతుందా ?

వెచ్చని పరుపు మీద నుంచి కప్పుకొన్న దుప్పటిని వదిలి, పైకి లేవాలంటే, అతి కష్టంగా తోచింది. ఎలాగో కూడదీసుకొని లేచాడు. అంతకు ముందు ఎరుగని, బవిరి గడ్డం, గుడుదిగుడు మీసాలు ముఖాన్ని చిందరవందర చేశాయి. అయ్యయ్యో!నడినెత్తి మీది జుట్టేమయింది? నున్నటి బట్టతల తళతళాడుతూ నవ్వింది! నిన్న వేసుకొన్న పిల్లవాడి బట్టలకు రెండింతలు వళ్ళు పెరిగిపోయాడుగా! అతని దుస్తులు పీలికలుగా పిగిలి పోయాయి. పోవు మరీ!

ఊహించని కొన్ని శారీరకమార్పులు నాన్నాకొడుకులకు కొంత అలజడిని కలిగించాయి. ఏది ఏమైనా, ఈ అనుకోని శారీరక మార్పులు నాన్నాకొడుకులను పట్టపగ్గాలు లేకుండా చేసాయి. ఎంతైనా, కొత్త ఒక వింత కదా !

కోరి మరీ తెచ్చుకొన్న వారి కొత్త అవతారాలతో, నాన్నాకొడుకులకు చిన్నచిన్న పేచీలు వచ్చి పడ్డాయి.

కొడుకు సుశీల్ ఇంటి బయటకు వెళ్ళి గెంతులు వేయాలన్న కోరికతోనే, పెద్దవాడిగా మారాలని కోరుకొన్నాడు. కానీ, ఇప్పుడు ఎందుకో ఏమో కానీ, ఆ పెద్ద శరీరంతో వెళ్ళి సాహసాలు చేయాలని అనిపించడం లేదు. చెట్లెక్కి కోతికొమ్మచ్చులు ఆడాలని గానీ, కొమ్మలు విరిచి కసరు కాయలు తినాలని గానీ, ఏట్లో అలిసిపోయే దాకా ఈతలుకొట్టాలని గానీ,అల్లరిచిల్లరగా తిరగాలని గానీ,ఏమాత్రం అనిపించడం లేదు. ఏదో అలసటగా,భారంగా ఉన్నది. ఆ చిన్నపిల్లల చేష్టలన్నీ,ఒక్కసారిగా అతనిని వదిలి పారిపోయాయి. కదలక మెదలక ,ఇంటి పట్టున ఉండాలని అనిపిస్తుంది.

అయినా, సుశీల్ అలవాటు కొద్దీ ఇంటికి దగ్గరలో ఉన్న జోల్ పాయ్ (ఆలివ్) చెట్టు దగ్గరికి వెళ్ళాడు. నేల మీద నుంచి బారెడు ఎత్తు లేని కొమ్మను ఎక్కేసరికి, ఓ పర్వతమెక్కినంత పనయ్యింది! అయినా సరదాకొద్దీ, చేతికి అందిన కొమ్మకు వేళ్ళాడి, ఊగబోయాడు. సుశీల బరువు కి, ఆ కొమ్మకాస్తా ఫెళ ఫెళమని విరిగిపడింది. కొమ్మతో పాటే, తన భారీకాయంతో సుశీల్ కూడా దబ్బున కిందపడ్డాడు. ఆ దారిన పోతున్న వాళ్ళు ఆగి మరీ, పకపకలాడారు. 'ఇంత వయసు వచ్చినా ఆ పిల్లచేష్టలు పోలేదు చూడండి !' అంటూ పగలబడి కడుపుబ్బేలా నవ్వారు!

ఎప్పటిలాగానే సుశీల్ తోటిపిల్లలు అతడితో ఆడుకొందామని వచ్చారు. మిసమిసలాడే నున్నని బూరెల బుగ్గలతో, ముచ్చట గొలిపే తమ స్నేహితుడు సుశీల్ కి బదులుగా ఈ ముడతలు పడి జారిపోయిన బుగ్గలతో ఉన్న ముసలివాడు ఆ పిల్లలను పలకరించాడు. సుశీల్ గరగర గొంతు వినగానే, పిల్లలు బిత్తరపోయారు. భయంతో గజగజ వణుకుతూ, ఒక్క పరుగున సుశీల్ కు దూరంగా పారిపోయారు.

సుశీల్ కు కూడా ఎప్పుడూ సరదాగా ఆడుకొనే తన బృందం, గోపాల్,అక్షయ్,నందా, హరీష్ లతో కలిసి వీధుల్లోకి వెళ్ళి ఆడుకోవాలని అనిపించలేదు. సుశీల్ కు ఇలాంటి అర్థంపర్థం లేని పిల్లల ఆటలకు దూరంగా, ఒంటరిగా ఉండాలనిపిస్తోంది.

ఇక, పిల్లవాడిలా మారిన సుబల్ కు, ఒక్క చోట కాళ్ళు తిన్నగా నేల మీద ఆనడం లేదు. సుబల్ కు కుదురుగా కూర్చోని, పుస్తకాలు ముందు వేసుకొని చదవాలని లేదు. పొద్దున్నే తయారయ్యి, బుద్ధిగా బడికి వెళ్లాలనీ అనిపించడం లేదు.

దానికి తోడు, ఇప్పుడు ఇంట్లో పెద్దవాడయిన సుశీల్ వచ్చి హెచ్చరించాడు, "తొందరగా తయరవ్వు. బడికి వెళ్ళాలి! "

సుబల్ కు బడికి వెళ్ళాలన్న వాస్తవం మింగుడు పడడం లేదు. కడుపు నొప్పి వచ్చిందని చెప్పి, బడి ఎగ్గొట్టాలని అనుకొన్నాడు.

సుశీల్ ససేమిరా వప్పుకోలేదు.

" వీల్లేదు !కడుపు నొప్పి లేదు. ఏమీ లేదు. బడికి వెళ్ళాల్సిందే!" సుశీల్ ఖచ్చితంగా చెప్పేసాడు.

సుశీల్ కఠినఆదేశాల ప్రకారం, సుబల్ బుద్ధిగా బడికి వెళ్ళి వచ్చాడు. బడి నుంచి వచ్చాక కాసేపు, బయటకు వెళ్ళి ఆడుకొందాం అనుకొన్నాడు.

పెద్దవాడయిన సుశీల్ అప్పటికే తన ముఖానికి దళసరి కళ్ళద్దాలు తగిలించుకొన్నాడు. రామాయణం పుస్తకం చదువుకోవాలని కూర్చున్నాడు.

పిల్లవాడయిన సుబల్ ఆపకుండా చేస్తోన్న అల్లరి వలన, సుశీల్ రామాయణపారాయణం సాగడంలేదు.

"రా ఇటు! వచ్చి నాఎదురుగా కూర్చో!" సుబల్ ను కేకేసి పిలిచాడు.

సుశీల్ బోలెడన్ని చిక్కులెక్కలు బరబరా గీసి ఇచ్చాడు.

"ఈ లెక్కలన్నీ చేశాకే నీ ఆటలు! అర్థమయిందా! " దళసరి కళ్ళద్దాల్లోంచి పెద్దపెద్ద కళ్ళను ఉరిమాడు.

అలాంటప్పుడు చిన్నపిల్లలు ఏం చేస్తారో , సుబల్ అచ్చంగా అలాగే చేసాడు. సుబల్ బెక్కుతూ, సుశీల్ రాసి ఇచ్చిన లెక్కలు చేయడం మొదలెట్టాడు. ఒక్క లెక్క తేలే సరికే ఒక గంటపైన పట్టింది !

ఈ లోగా చీకటి పడనే పడింది.

చీకటితో పాటే, సుబల్ స్నేహితులు ఇంటికి రానే వచ్చారు. ప్రతిరోజు లాగానే వారితో, ఇప్పుడు సుశీల్ చదరంగం చడడం మొదలు పెట్టాడు.

ఇన్నిమార్పులు వచ్చినా సుశీల్ కి తన తండ్రికి ఏది పడితే అది తినడం ఇష్టం లేదని గుర్తుంది. ఆ ఇష్టాన్ని గౌరవిస్తూ ఇప్పుడు పిల్లవాడయిన సుబల్ కు తినడానికి, కొంచెం కొంచమే పెట్టేవాడు.

పిల్లలకు అల్లరితో పాటు ఆకలి కూడా ఎక్కువ కదా. పిల్లతనంతో పాటు ఆకలి కూడ వచ్చిపడింది కదా, కొంచెం కొంచెం తింటే, అది ఏ మూలకు సరిపోతుంది. పాపం! సుబల్ కు కరకరలాడే ఆకలి కడుపుతోనే, కాలం నెగ్గుకు రావాల్సి

వస్తోంది. ఎప్పుడూ నీరసంగా, ఆకలితో నకనకలాడుతూ ఉంటున్నాడు. పెరిగే పిల్లవాడు కదా, తగ్గిన తిండి ప్రభావం వంటి పై పడదూ ?

సుబల్ ఎదుగూబొదుగూ లేకుండా, రోజురోజుకీ పాలిపోతున్నాడు. చిక్కి పోతున్నాడు.

చిన్నవాడయిన సుబల్ తిండి కష్టాలు ఇలా ఉంటే, పెద్ద వాడయిన సుశీల్ తిప్పలు మరింత వింతగా ఉన్నాయి. పెద్దవాడయ్యాక, సుశీల్ తన స్వభావానికి భిన్నంగా ఉండాల్సి వస్తోంది. ఏ కాలక్షేపం కబుర్లు,సరదాలు అతనికి నచ్చడం లేదు. ఇరుగుపొరుగుతో ఎంతో మర్యాదగా వ్యవహరించవలసి వస్తోంది. నిజానికి, అప్పుడప్పుడు ఇరుగుపొరుగును రహస్యంగా ఆటపట్టించడం లోనే సుశీల్ కు ఆనందం కలుగుతుంది.

ఒక రోజు సుశీల్ ఉండబట్టలేక, ఒక చెట్టు చాటునుంచి, నీటి కడవను వడిసెలతో గురిచూసి రాయిని విరిసాడు. "ఇంత వయసు వచ్చింది. బుద్ధి మాత్రం రాలేదా ?"అంటూ ఇరుగమ్మ పొరుగమ్మలు కదిలి వచ్చిన కాళీమాతల్లా, వెంట పడి మరీ తరిమారు.

అలాంటి పిల్లబుద్ధి తనని పక్కతోవ పట్టిస్తుందేమో,పరువుతీస్తుందేమో అనుకొని బుద్ధిగా ఇంటి గడప దాటకుండా ఉంటున్నాడు. తనకు తానే, తన నీడకు తాను ఒక వెలిసిన ప్రతిబింబంలా భావించసాగాడు.

ఒకరోజు, సుశీల్ పెరటికి వెనకగా ఉన్న దొరువులో స్నానం చేయడానికి వేళ్ళాడు. ఆ చల్ల నీళ్ళు తాకగానే, ఎక్కడి కీళ్ళు అక్కడ బిగుసుకుపోయాయి. కనీసం తల దువ్వుకోవడానికి కూడా చేయి పైకి లేవ లేదు. ఓ ఆరు నెలలు మందులు మింగాల్సి వచ్చింది. అప్పటి నుంచి, ఇంట్లో పొయ్యి మీద వేడి నీళ్ళు కాచుకొని స్నానం చేస్తున్నాడు.

ఒక్కోసారి పాత అలవాటు కొద్దీ, పిల్లవాడయిన సుబల్ వెళ్ళి, పెద్ద వాళ్ళ మధ్యలో కూర్చునే వాడు. వాళ్ళ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని, మాట్లాడేవాడు. పెద్దవాళ్ళకు చిర్రెత్తుకు వచ్చేది.

"ఒరేయ్! పిల్లవాడివి నీకెందుకురా పెద్దాళ్ళ వ్యవహారాలు !" అని చెవి మెలివేసి మరీ, అక్కడ నుంచి దూరంగా తరిమేసే వారు.

ఇంకో సారి మాట్లాడుతూ మాట్లాడుతూ,వారి భుజాల మీద చనువుగా చేయి వేయ బోయాడు. పెద్దవాళ్ళ చేతికర్రలు తిరగేసి మరీ, తరిమితరిమి కొట్టారు

మరోసారి ఏకంగా, బడిలో పంతులు దగ్గరికే వెళ్ళి, ఒక పొగాకుకాడ చుట్టను ఇమ్మని అడిగాడు. ఆ పంతులు ఊరు కొంటాడా? చేతిబెత్తం విరిగేలా బాది, తరగతిలో అందరి ముందు రోజంతా బెంచీ మీద నిలబెట్టాడు.

దానికి తోడు,ఇప్పుడు పెద్దవాడయిన సుశీల్, చిన్నచిన్న అల్లరిపనులకే సుబల్ ను చీటికిమాటికి చితక బాదేస్తున్నాడు. పై నుంచి, "బడిలో ఇవే నేర్పిస్తున్నారారా నీకు? " అని ఆపకుండా తిట్లు.

ఇక, తండ్రీకొడుకుల తారుమారు వ్యవహారం కలిగించిన గందరగోళం తారాస్థాయికి చేరుకొంది. అయోమయంగా ముదిరి పాకాన పడింది. విషయాలన్నీ అవకతవకగా తయారయ్యాయి. కోరి తెచ్చుకొన్న ఈ తిరకాసు

తంతు, ఇద్దరికీ ఒక తలనొప్పిలా తయారయ్యింది. ఇద్దరూ తమ తమ పాతరూపాల్లోకి ఎప్పుడెప్పుడు మారిపోదామా అని అనుకోసాగారు.

వారిద్దరికీ, తాము చేసిన పొరపాటు ఏమిటో తెలిసి పోయింది. అందుకేగా అంటారు, ఏ వయసుకు ఆ ముచ్చట అని!

ఇంతలో , అక్కడికి ఇచ్ఛాఠాకూరాణి రానే వచ్చింది.

"మీ ఇద్దరూ కోరిన కోరికలు తీరాయిగా ? మరి, సంతోషం గా ఉన్నారా !?" అని అడగనే అడిగింది.

మరోమాట మాట్లాడకుండా, ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా, తమ తమ నిజ రూపాలలోకి మార్చేయమని కోరారు నాన్నా కొడుకులు.

అసలే ఇచ్ఛాఠాకూరాణీ అడిగిన కోరికలు ఇచ్చేసే తల్లి కదా ! అలాగే వారి నిజరూపాలను వారికి ఇచ్చేసింది.

అయితే, మరునాడు సూర్యోదయం దాకా ఆగాలని చెప్పింది.

" బూం ! హాం ఫట్ ! మీ కోరికలు తీరును గాక !"

★

ఆ మర్నాడు పొద్దున్నే, ఏదో పీడకలలో నుంచి లేచినట్లు లేచారు, నాన్నాకొడుకులు.

వాళ్ళ నిజశరీరాలతో పాటే, వారి పాత పద్ధతులు వారికి తిరిగి వచ్చేసాయి.

" ఒరేయ్ సుశీల్ ! ఇంకా వ్యాకరణం రాయకుండా ఏం చేస్తున్నవ్ రా?" నాన్న సుబల్ చెవులు బద్దలయ్యేలా అరిచాడు.

పిల్లవాడు సుశీల్ తన చిలిపిగొంతులో అల్లరి దాచుకొంటూ, అంతే వేగంతో తన టక్కరి జవాబు ఇచ్చాడు.

" నా వ్యాకరణం పుస్తకం ఎప్పుడో పోయిందిగా నాన్నా! "

★★★★

Foot Note : 1. భూగోళ శాస్త్రం : జాగ్రఫీ 2. వ్యాకరణం : గ్రామర్ 3. జోల్ పాయ్ చెట్టు : ఆలివ్ చెట్టు



రవీంద్రనాథ్ ఠాగూర్ (1861-1941) విశ్వకవి.సాహితీవేత్త. చిత్రకారులు, విద్యావేత్త, దార్శనికులు. జాతీయవాది. సాహిత్యంలో అత్యున్నత నోబెల్ పురస్కార అలంకృతులు. (గీతాంజలి,1913) పిల్లలపెంపకం, పిల్లలచదువుల పట్ల అభిమానంతో ఠాగూర్ పిల్లలకోసం, పిల్లలగురించి అనేక రచనలు చేశారు. ప్రతిపూటా ప్రతిచోటా, మన జాతీయ గీతం "జన గణ మన"తో పలకరిస్తూనే ఉంటారు. వినూత్న విద్యావిధానంతో, భారతీయతను మేళవించి ఠాగూర్

స్థాపించిన శాంతినికేతన్ (1901),"విశ్వభారతి" లా పరిణమించింది. పిల్లల చదువుల్లో ప్రపంచదృష్టి నే ప్రభావితం చేసింది. ప్రధానంగా, ఠాగూర్ బెంగాలీ, ఇంగ్లీషు లలో సాహిత్య సృజన చేశారు. వారికి సంస్కృతం, హిందీ, జర్మనీ భాషలలో ప్రావీణ్యం ఉన్నది.

***"ఇచ్ఛాపూరణ్"*** ( 1895 ) పిల్లల పెంపకం పై ఓ గట్టి చురక. "ఏ వయసుకు ఆ ముచ్చట" అన్న మాట ఈ కథకు మూల సూత్రం. ఎవరికి వారు తన జీవితం కన్నా ఎదుటివారి జీవితం మిన్న అన్న భావనలో ఉండడం మానవ నైజం. ఒకరి జీవితం మరొకరు జీవించినపుడేగా , అందులోని మంచీ చెడు తెలిసేది. ఈ కథలో, అలా జీవించే అవకాశం, నాన్నా కొడుకులకు రావడంతో అసలు తమాషా ఉంటుంది. సరదాగా జీవిత సత్యాలను చెప్పడం ఠాగూర్ శైలి.

అనుసృజకులు: ***చంద్రలత*** తెలుగు రచయిత. విద్యావేత్త. కథనశాస్త్రజ్ఞులు. పిల్లల కోసం అనేక రచనలు చేశారు. పిల్లలకు సృజనాత్మక రచనల అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లల రచనలను సంకలన పరిచారు. పిల్లల మీది ఇష్టంతో ఠాగోర్ రచనలను పిల్లలకోసం అనుసృజన చేస్తున్నారు.

**Referred English Translations:**

1. Four Stories from Tagore ,(2003) When Wishes Come True, Translted by Swapna Dutta, Orient Longman,2003
2. Tagore, Rabindranath (2010). Chattopadhyay, Ratan Kumar, ed. Selections from Galpaguchchha (3 volumes). Orient Blackswan.

. https://www. kiddingtown. com/when-wishes-come-true-rabindranath-tagore-class-8-class-9-class-10-cbse-ncert-igcse-scert-summary-questions-and-answers-theme-characters/

3. http://writetoscore. com/2016/06/13/cbse-english-class-7-wishes-come-true/
4. . https://itschool. gov. in/pdf/Std_VIII/English/Eng%20Class%208%20Vol%201. pdf
5. https://www. youtube. com/watch?v=u9yW4i6nsk0

COMMENTS